ప్రజాశక్తి
శనివారం 28 జూన్ 2025
5
పార్వతీపురం మన్యం

29న సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా సదస్సు

సీతానగరం : ఈనెల 29న పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు బంటు దాసు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎప్పుడో ప్రారంభించిన జంఝావతి మోక్షం లేదని, తోటపల్లి ఎడమ కాలువకు దిక్కేలేదని అన్నారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తయితే పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, సీతానగరం, బలిజిపేట మండలాల్లో 75 గ్రామాల్లో 24వేల ఎకరాలకు సాగునీరందుతుందని, కానీ నేటికీ ఒడిస్సాతో సమస్య ఉందని ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. అంతే కాకుండా కారిగెడ్డ, ఆడారిగెడ్డ, జంపరకోట, వనకాబడి గెడ్డ, పెద్దగెడ్డ, గుమ్మడిగెడ్డ రిజర్వాయర్లకు సంబంధించి ఎటువంటి పనులకేపోవడంతో నిర్వీర్యమవుతున్నాయని, ఈ సమస్యలన్నింటిపై చర్చించేందుకు రైతులంతా అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అభివృద్ధి చూస్తే ఆనందంగా ఉంది

ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్ నుంచి బయటకు
జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనులు అధికంగా ఉన్న మన్యం జిల్లా అభివృద్ధిని చూస్తుంటే ఆనందంగా ఉందని ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023-24లో రాష్ట్ర జిడిపి 12.94 శాతానికి పెరిగిందని చెప్పారు. అంతకుముందు వైసిపి ప్రభుత్వ హయాంలో జిడిపి 8.9 శాతం వుండేదని అన్నారు. 2014నుంచి 2019 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో జిడిపిని 15శాతానికి తీసుకెళ్లినట్లు చెప్పారు. 2024-25 మధ్య కాలంలో మన్యం జిల్లా జిడిపి 16.09 శాతానికి చేరిందని చెప్పారు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మొదటి స్థానంలో వుంటే మన్యం జిల్లా రెండో స్థానంలో నిలవడం ఆనందంగా ఉందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో జిల్లాను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఎదురవుతున్న ఇబ్బందులను ఎలా అధిగమించాలో చర్చించినట్లు తెలిపారు. జిల్లాను అధికారులు, ఉద్యోగుల కొరత వేధిస్తోందని చెప్పారు. రాష్ట్రానికి చివర్లో ఉన్న మన్యం జిల్లాకు రావడానికి ఎవరూ ఇష్టపడడం లేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా నుంచి బదిలీ అయిన ఉద్యోగులను వారి స్థానంలో ఉద్యోగులు వచ్చే వరకు రిలీవ్ చేయొద్దని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. శాఖలవారీ ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటికి ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్ మీద ఉందని చెప్పారు. గడచిన ఏడాది కాలంలో సిఎం చంద్రబాబు నాయుడు ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి ఆక్సిజన్ పీల్చుకునే స్థాయికి చేర్చారని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా మొదట పింఛను మొత్తాన్ని పెంచి 65లక్షల మందికి రూ.34వేల కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు ఐదు రూపాయలకే భోజనం పంపిణీ చేసేందుకు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ 75 అన్న క్యాంటీన్లు నెలకొల్పాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేశామని, గ్యాస్ బుకింగ్ చేసిన వెంటనే డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా తల్లికి వందనం పథకం కింద రూ.8,700 కోట్లు ఒకేరోజు విడుదల చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అవినీతి, దౌర్జన్యం, తప్పుడు కేసులతో వేధింపులకు గురి చేయడంతో వ్యవస్థలన్నీ చిన్నాభిన్నమయ్యాయని ఆరోపించారు. వ్యవసాయరంగంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో పనిముట్లు పంపిణీ చేశామని తెలిపారు. జిల్లాలో ఉద్యానవన తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన భూసర్వే కారణంగా రైతులు ఎక్కువగా భూసమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఏడాదిలోగా భూ సమస్యలు పరిష్కరించాలని సిఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారని చెప్పారు. జిల్లాలో ఏనుగుల సమస్య పరిష్కారానికి కుంకీ ఏనుగులను కర్ణాటక నుంచి తీసుకొచ్చినట్టు చెప్పారు. ఇవి శిక్షణ పొందిన తర్వాత మొదటిగా జిల్లాలో ఆపరేషన్ మొదలు పెట్టాలని కోరినట్లు చెప్పారు. ఏజెన్సీలో రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అధికారులు అడ్డంకులు సృష్టించొద్దని ఆదేశించామని చెప్పారు. వైసిపి హయాంలో మంజూరైన మెడికల్ కాలేజీని పిపిపి పద్ధతిలో నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ గత ఐదేళ్ల లో వైసిపి ప్రభుత్వం విధ్వంసం దిశగా రాష్ట్రాన్ని నడిపించిందని చెప్పారు. జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు డిప్యూటీ సీఎంలుగా పని చేసినా అభివృద్ధి జరగలేదన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరీ, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్వో కె.హేమలత పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు

జర్నలిస్టులంటే అంత చులకనా?

మన్యం జిల్లా ఏర్పాటై మూడేళ్ళు దాటిపోయింది. ఇద్దరు జిల్లా కలెక్టర్లు పని చేశారు. వెనుకబడిన జిల్లా అయినా అన్ని జిల్లాల మాదిరిగానే కార్యక్రమాలు జరుగుతున్నాయి. అన్ని కార్యక్రమాలను మీడియా ప్రతినిధులు వారి మాధ్యమాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. అయితే గత కొన్నేళ్లుగా జిల్లా కేంద్రంలో గల మీడియా ప్రతినిధులంటే జిల్లా అధికారులకు చులకన భావం కనిపిస్తోంది. మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా కేంద్రానికి వచ్చి సమావేశాలు నిర్వహించినప్పుడు గానీ, మీడియా సమావేశాలు ఏర్పాటు చేసినప్పుడు గాని సంబంధిత మీడియా ప్రతినిధులకు గౌరవమర్యాదలు జరిగేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌరసంబంధాల అధికారికి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి జిల్లాలో కనిపించడం లేదు. శుక్రవారం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కలెక్టరేట్‌లో సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, ప్రభుత్వ విప్ జగదీశ్వరి హాజరయ్యారు. ఇలాంటి కార్యక్రమానికి మంత్రుల అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. వారందరికీ కలెక్టరేట్ ఆవరణలో భోజనాలు ఏర్పాటు చేశారు. కలెక్టర్ కార్యాలయం సిబ్బంది, పోలీసులు కూడా అక్కడే భోజనాలు చేశారు. ఇంఛార్జి మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన సమీక్ష సమావేశం జరుగుతుండగానే బయట భోజనాలు ప్రారంభించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు మంత్రులిద్దరూ మీడియా సమావేశంలో మాట్లాడారు. 3 గంటల తర్వాత జిల్లా అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు కలెక్టరేట్ మొదటి అంతస్తులో భోజనాలు ఏర్పాటు చేశారు. అంటే వారందరినీ విఐపిలు గా భావించి భోజనానికి ఆహ్వానించారు. కానీ ఉదయం 11 గంటల నుంచి కలెక్టరేట్ ఆవరణలోనే ఉన్న మీడియా ప్రతినిధులను మాత్రం భోజనానికి ఏ అధికారీ పిలవలేదు. కనీసం మీడియా వ్యవహారాలు చూసే అధికారి కూడా జర్నలిస్టుల భోజనం గురించి అడగలేదు. అంతకుముందు కలెక్టరేట్ మొదటి అంతస్తులో భోజనాలు ఏర్పాటు చేశారని డిపిఆర్ఒ కార్యాలయం సిబ్బంది ఒకరు చెపితే జర్నలిస్టులంతా అక్కడికి చేరుకున్నారు. వారిని చూసిన రెవెన్యూ సిబ్బంది మీడియా వారికి భోజనాలు పెట్టాలా వద్దా ఒక జిల్లా అధికారిని అడిగారు. మీడియా ప్రతినిధులకు భోజనాలు పెట్టొద్దని, అక్కడ విఐపిలకు భోజనాలని మెసేజ్ పంపించారు. దీంతో అక్కడ పరిస్థితిని గమనించిన జర్నలిస్టులు ఆకలితో భోజనం చేయకుండా వెనుదిరిగారు. జిల్లా స్థాయి సమావేశాలకు మంత్రులు హాజరైన సందర్భంలో కూడా మీడియా ప్రతినిధులకు భోజనాలు పెట్టలేని దుర్భర స్థితిలో జిల్లా యంత్రాంగం వున్నదా, లేకపోతే జర్నలిస్టులు విఐపిలు కారనే భావంలో జిల్లా అధికారులు వున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పక్క రాష్ట్రానికి ఎరువు... స్థానిక రైతుకు కరువు

- యథేచ్ఛగా అక్రమ విక్రయాలు
- మండలంలో ఎరువుల డీలర్ల తీరు

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం రైతులకు తక్కువ ధరలకే ఎరువులు అందించాలని సబ్సిడీ రూపంలో సరఫరా చేస్తున్నప్పటికీ, స్థానిక ఎరువుల డీలర్లు నిబంధనలు తుంగలో తొక్కిన స్థానిక రైతులను పక్కన పెట్టి శుక్రవారం వారపు సంత సందర్భంగా పక్క రాష్ట్రమైన ఒడిశాకు అధిక మొత్తంలో రవాణా ఎరువులు సాగుతున్నాయి. ఎరువుల విక్రయంలో డీలర్లు మెలికలు పెడుతుండడంతో సక్రమంగా దొరకడం లేదని స్థానిక రైతులు ఆవేదన అందుతున్నారు. అయితే ఇతర రాష్ట్ర వాసులకు ఎంత కావాలంటే అంత ఎరువులు లభ్యమవ్వడం ఇక్కడి రైతులు వకింత ఆశ్చర్యానికి గురవుతున్నారు. స్థానిక రైతులకు ఒక బస్తాకు సుమారు రూ.60 నుండి రూ.70 ఎక్కువకు దుకాణదారులు అమ్ముతున్నప్పటికీ అధికారులకు తెలిసినా నేరుగా ఫిర్యాదు రానిదే తామేమీ చేయలేమని చేతులెత్తేయడం ఆరోపణలకు చోటుగా మారుతుంది. ఒడిశా వారికి సుమారు రూ.150 అధికంగా రావడంతో అధిక మొత్తంలో వారికే అమ్ముతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. స్థానిక రైతులకు ఒక ఆధార్ కార్డుపైన కొన్ని బస్తాలకే పరిమితం చేసిన ప్రభుత్వం బ్లాక్ మార్కెట్లో కొన్నవారికి ఆ నిబంధనలేవీ వర్తించకుండా విరివిగా ఎరువులు ఏ విధంగా లభ్యమవుతున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. స్థానికులైతే యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువులను అంటగట్టే దుకాణదారులు వారికి మాత్రం నేరుగా ఎరువులను విక్రయిస్తున్నారు. ఎరువుల అక్రమ రవాణాను నియంత్రంచాల్సిన అధికారులు, విజిలెన్స్ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి వెంటనే తమకు మేలు కలిగేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మక్కువ సంత నుంచి ఒడిశాకు తరలిపోతున్న ఎరువులు

ప్రశాంతంగా సూపర్ 50 ప్రత్యేక బ్యాచ్ ఎంపిక

ప్రజాశక్తి - పార్వతీపురం

సూపర్ 50 ప్రత్యేక బ్యాచ్ ఎంపిక పరీక్ష చాకలి బెలగాంలోని గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించినట్టు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ పరీక్షకు 288 మంది విద్యార్థులు హాజరయ్యారని, ఈ సూపర్ 50 బ్యాచ్ పథకంలో మార్కుల ప్రాతిపదికన ఎంపిక కాబడిన 50 మంది బాలురకు, 50 మంది బాలికలకు వేర్వేరు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఈ తరగతుల ద్వారా విద్యార్థులుకు టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. పరీక్ష అనంతరం తక్షణమే స్పాట్ వాలిడేషన్ నిర్వహించి, 50 మంది బాలురను, 50 మంది బాలికలను ఎంపిక చేసి ఫలితాలను ప్రకటించారు. పరీక్ష నిర్వహణలో పాల్గొన్న అధికారులును, సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి ఆర్.కృష్ణవేణి, ఉప విద్యాశాఖాధికారి జ్ఞాన ప్రకాశ్, సూపరింటెండెంట్ కె.దేశ్, ఎఎంఒ ఆదినారాయణ, జిసిడిఒ కొండమ్మ, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, రాష్ట్ర స్థాయి పరీక్షల పరిశీలకులు జి.జాస్సన్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

శ్రీప్రజాశక్తి - సీతానగరం, బలిజిపేట, సాలూరు

కార్మిక సంఘాలు జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు మన్యంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జీపు జాతా గురువారం సీతానగరం చేరుకుంది. అనంతరం శుక్రవారం మండలంలోని చినబోగిలిలో ఉపాధి వేతన వేతనదారులనుద్దేశించి ఆయన మాట్లాడారు. వ్యవసాయ పనుల్లో వస్తున్న యాంత్రీకరణలో భాగంగా ఉపాధి కూలీలకు పని దినాలు తగ్గుతున్నాయన్నారు. ఉపాధి హామీ చట్టం వామపక్షాల ఒత్తిడితో 2005లో వచ్చినప్పటికీ దాన్ని ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని వీటిని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఉపాధి కూలీకి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను వ్యవసాయ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం జాపు జాతా బలిజిపేటకు చేరుకుంది. జాతా నాయకులకు స్థానిక కార్మికులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అక్కడి బస్టాండ్ నుంచి ర్యాలీ నిర్వహించి సిఐటియు నాయకులు కె.దాలమ్మ అధ్యక్షతన సభజరిగింది. ఈ సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు గంట జ్యోతిలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాకాడ ఇందిరా, ఆర్.రాము మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని, కార్పొరేట్లకు అనుకూలమైన, కార్మికులకు నష్టం చేసే విధానాలు తీసుకొస్తున్నాయని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అసంఘటితరం కార్మికులకు సమగ్ర శాసన చట్టం చేయాలని, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. **మక్కువ :** జీపు యాత్రలో భాగంగా మక్కువకు చేరుకున్న జిల్లా బృందానికి స్వాగతం పలికి అనంతరం రచ్చబండ నుంచి మక్కువ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. సిఐటియు మండల నాయకులు పవన్ అధ్యక్షతన జరిగిన సభలో నాయకులు మాట్లాడారు. **సాలూరు :** జీపుజాతా మండలంలోని మామిడిపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సార్వత్రిక సమ్మె ఆవశ్యకతను వివరించారు. **పాచిపెంట :** జీపు యాత్ర మండలంలోని పనుకువలస, పాచిపెంటలో ప్రచారం జరిగింది. సభలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతిలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రమణారావు, మన్మధరావు, ఎన్వై నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాము, కృష్ణారావు, దాలమ్మ, గౌరీశ్వరి, సుశీల, పాచిపెంట మండల నాయకులు పార్వతి బంగారమ్మ రవణమ్మ, సీతానగరం సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, ఆర్.రాము, బలిజిపేట మండల రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం, రైలు మిల్లు నాయకులు ఆవు సాంబమూర్తి, బి.భానుమూర్తి, నల్ల ఈశ్వరరావు, అప్పారావు, సత్యం, పెద్ద ఎత్తున స్కీం వర్కర్లు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న అజశర్మ

బలిజిపేటలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు రమణారావు

డిఇఒకు వినతి పత్రాన్ని అందజేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జులై 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు మధ్యాహ్న భోజన కార్మికులు డిఇఒ రాజ్‌కుమార్‌కు శుక్రవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక, కర్షక సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు, స్కూల్స్ స్వీపర్లు పాల్గొంటారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్నం భోజన నిర్వహణ నిమిత్తం విద్యార్థులకు చెల్లిస్తున్న మెనూ చార్జర్ పెంచాలని, వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రోజురోజుకు మధ్యాహ్నం భోజన పథకం నిర్వహణలో అనేక మార్పులు తీసుకొస్తుందని ఆ మార్పులకు అనుగుణంగా పారితోషకాలు ఇవ్వకపోవడం సరైనది కాదని అన్నారు. ఇప్పటికైనా మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వహకుల సంఘం, స్కూల్స్ స్వీపర్ల సంఘం నాయకులు తులసి, వెంకటమ్మ, పద్మ, మంగ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని వినతి

వీరఘట్టం : పని భారం తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఎంపిడిఒ బి వెంకటరమణకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని భారం ఒత్తిడి వల్ల మానసికంగా గురవుతు న్నామని, ఉదయం 6 గంటలకు క్లోరినేషన్, పారిశుధ్య పనులు పర్యవేక్షణ వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

పోస్టాఫీసు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న పోస్టల్, రెవెన్యూ అధికారులు

పోస్టాఫీస్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిసిసి వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని పోస్ట్ ఆఫీస్ భవన నిర్మాణం కోసం శుక్రవారం పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు అద్దె భవనంలో పోస్ట్ ఆఫీస్‌ను నడుపుతున్నామన్నారు. పోస్టాఫీస్ భవన నిర్మాణం కోసం రెవెన్యూ సిబ్బంది చూపించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామని, ఉన్నతాధికారులకు నివేదిక పంపించి ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నబగ్గ కొండల్లో ఏనుగులు తిష్ట

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని చిన్న బగ్గ కొండల్లో ఏనుగులు తిష్ట వేశాయి. గత రెండు రోజులుగా ఏనుగులు చిన్నబగ్గ కొండల్లో సంచరించడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కొండపోడుకు వెళ్లాలంటే భయం ఆందోళన చెందుతున్నారు. ఈ ఏనుగులు ఎప్పుడు ఎవరు మీద దాడి చేస్తాయని క్షణం క్షణం భయంతో కాలం వెళ్లదీస్తున్నారు.

మరో పాఠ'శాల' ఏర్పాటు

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వాలు ఎన్ని మారినా పాఠశాల పక్కా భవనం లేకపోవడం తో మండలం లోని మార్కొండపుట్టి పంచాయతీ కె.పెద్దవలస గిరిజన గ్రామస్తులంతా కలిపి కొత్త బడి సాలను నిర్మించుకున్నారు. ఈ గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులు కూడా నియమించబడ్డారు. అయితే గత ప్రభుత్వంలో నాడు నేడు రెండో విడత కింద పాఠశాల పక్కా భవనానికి నిధులు మంజూరై పునాదులు వేసి పిల్లర్ల దశలో ప్రభుత్వం మారిపోయింది. దీంతో పాఠశాల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో గ్రామస్తులు గతంలో నిర్మించిన రేకుల షెడ్డులోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది మోడల్ ప్రైమరీ పాఠశాల కావడంతో ఇటు విద్యార్థులు అటు ఉపాధ్యాయుల సంఖ్య పెరిగి ఒక్క రేకుల షెడ్డు సరిపోకపోవడం లేదు. దీంతో గ్రామస్తులంతా కలిపి బడి సాలను నిర్మించుకున్నారు. పక్కా భవనం నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

విద్యార్థుల చదువు కోసం శాలను నిర్మిస్తున్న కె.పెద్దవలస గిరిజనులు

బాలల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

బాలల్లో ఆరోగ్య సమస్యలు, శారీరక, మానసిక వైకల్యాలు, లోపాలు ముందుగానే గుర్తించాలని ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని 21 వార్డులో గల చిల్డ్రన్ కేర్ హోమ్‌లో జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రం (డిఇఐసి) వైద్య బృందం శుక్రవారం పిల్లలకు చేపట్టిన వైద్య పరీక్షలను ఆయన పర్యవేక్షించారు. పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ భరత్ చంద్ర వైద్య తనిఖీలు చేపట్టారు. పుట్టుక, ఎదుగుదల లోపాలు, వ్యాధులు, వైకల్యాలు, వాటికి సంబంధించి లక్షణాలు ఏవైనా ప్రస్ఫుటత మవుతున్నాయా అని పరీక్షించారు. హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది సర్వే చేసి పిల్లల్లో ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించాలని, తద్వారా సమస్యలను పరిష్కరించి బాలలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్‌ను అందజేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ ఎల్.భరత్ చంద్ర, వైద్యులు డాక్టర్ సౌజన్య, డిఇఐసి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

మాతృ భాషా ఉపాధ్యాయులను (సవర భాష విద్య వాలంటీర్లు) 2025 -26 విద్యా సంవత్సరంలో రెన్యువల్ చేసి విధుల్లో కొనసాగించాలని మాతృభాష ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సవర ఆనందరావు శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.అన్న దొరకు వినతిపత్రం ఇచ్చారు. పాఠశాలలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా రెన్యువల్ చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల 152 పాఠశాలల పరిధిలో గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, పివిటిజి విద్యార్థులకు వారు భాషలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తున్నామని తెలిపారు. కేవలం రూ.5వేలకు 23 ఏళ్లుగా పనిచేస్తున్నామని, కావున జీతాలు పెంచాలని కోరారు.

ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

పెదపెంకిలో దాహం కేకలు

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గత నెల రోజులుగా దాహం కేకలు వినపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆ గ్రామానికి చెందిన మహిళలదరూ శుక్రవారం ఖాళీ బిందెలతో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు సంజీవని సమక్షంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ పెదపెంకిలో గత నెల రోజులుగా మంచినీరు అందడం లేదని, దీనివల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలుషితమైన నీరు తాగడం వల్ల వ్యాధుల బారినపడుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక అధికారులకు తెలిపినా స్పందించకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ ప్రజలు. మహిళలు కోరుతున్నారు.

జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి

జీడి ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించిన మంత్రులు

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక మార్కెట్ యార్డ్‌లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన క్యాజు ప్రాసెసింగ్ యూనిట్‌ను జిల్లా ఇన్చార్జి మంత్రికింజరాపు అచ్చం నాయుడు, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి గుమ్మిడి సంధ్యా రాణి తనిఖీ చేశారు. శుక్రవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఇన్చార్జి మంత్రి జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన క్యాజు ప్రాసెసింగ్ యూనిట్ను తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. రూ .74 లక్షలతో ఏర్పాటు చేసిన యూనిట్ను మహిళా సంఘాలు నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయ చంద్ర, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎ పిఒలు అశుతోష్ శ్రీవాస్తవ, సి యశ్వంత్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే పర్యాటక అభివృద్ధి

ప్రజాశక్తి - కురుపాం

కూటమి ప్రభుత్వం తోనే రాష్ట్రాభివృద్ధితో పాటు పర్యాటక అభివృద్ధి సాధ్యపడుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ అన్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన పర్యాటక సమావేశం- టెక్ 2.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమక్షంలో అరుకులో విఎస్‌కె హెూటల్స్, రిసార్ట్స్ స్థాపనకు అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, పర్యాటక అభివద్ధిలో భాగంగా తనవంతు కషి చేస్తానని అన్నారు.

సిఎం చేతుల మీదుగా అరకు రిసార్ట్స్ ఒప్పంద పత్రం అందుకుంటున్న వీరేష్ చంద్ర దేవ్

అంతర్‌రాష్ట్ర రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

రహదారిపైనే డంపింగ్ యార్డ్ చెత్త

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల డంపింగ్‌యార్డ్ చెత్తలో చెత్తను పేరుకుపోయి అంతర్ రాష్ట్రీయ రహదారిపైకి చెల్లాచెదురుగా పడి ఉండడంతో ఆ రహదారిపై రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు, భారీ వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా గాలి వీస్తే రహదారిపై ప్రయాణించే వారి ముఖాలపైనే చెత్త కాగితంలు, పాలిథిన్ కవర్లు పడడంతో ప్రమాదాల బారిన పడి ఆసుపత్రులు పాలయ్యే సందర్భాలు కూడా ఉన్నాయి. మున్సిపల్, ప్రజారోగ్య అధికారులు స్పందించి రోడ్డుకు ఆనుకొని ఉన్న చెత్తను డంపింగ్ యార్డ్ లోపల వేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నట్టల నివారణ మందును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి పాడి రైతు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ వైద్య అధికారి కె.శైలజ అన్నారు. మండలంలోని రజ్జిలిలో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జీవాలకు ఏడాదికి నాలుగు సార్లు ఉచితంగా నట్టల నివారణ మందులను అందజేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం మొదట విడతగా ఈనెల 26 నుంచి వచ్చేనెల 7 వరకు ప్రతి గ్రామంలో నట్టల నివారణ మందులు పంపిణీ చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలు, వెటర్నరీ వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది ప్రభుత్వ పాఠశాలేనని మండలంలోని మరిపివలస ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వాలేటి తవిటి నాయుడు అన్నారు. అడ్మిషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా ఆయన మరిపి వలస పాఠశాలకు ఫీడింగ్ విలేజస్ గా ఉన్న సూరంపేట, గుచ్చుమి, చిన్నారాయుడు పేట తదితర గ్రామాల ఉపాధ్యాయులంతా ఆయా గ్రామాల్లో పర్యటించి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారిని కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. 5 విద్యార్థులతో కలిపి 56 మంది కొత్తగా విద్యార్థులు చేరడంతో ఈ విద్యా సంవత్సరం తమ పాఠశాలలో 205కు రోలు పెరిగిందన్నారు. జిల్లాలో ఒక ప్రభుత్వ పాఠశాలలో ఇంత మంది విద్యార్థులు చేరడం ఆశ్చర్యకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు వివిధ గిరిజన గ్రామాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను, సౌకర్యాలను, సదుపాయాలను, ఉపాధ్యాయుల నైపుణ్యాలను వారికి వివరించి ఆ పిల్లల్ని తమ పాఠశాలలో చేర్చుకునేలా కౌన్సిలింగ్ ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్ర చికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

ప్రత్యేక కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల సచివాలయల పరిధిలో గల గ్రామాల్లో నిర్వహించిన నేత్ర వైద్య శిభిరాల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టేరిజియం (కొయ్యకండ) లోపం ఉండి గుర్తించిన వారికి శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం, పుష్పగిరి కంటి ఆసుపత్రికి శస్త్ర చికిత్సల కోసం తరలించినట్లు మన్యం జిల్లా నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందుల సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. శస్త్ర చికిత్సలకు వెళ్తున్న రోగులకు తీసుకోవాల్సిన జాగ్రతలు గూర్చి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రచికిత్సకు వెళ్తున్న రోగులు

పాలకవర్గం పట్టించుకోదు... ప్రభుత్వం కన్నెత్తి చూడదు

- ఒకరికొకరు పొంతన లేని అధికారులు
- ఎక్కడి సమస్యలు అక్కడే
- ఏడాది పాలనలో అభివృద్ధికి ఆమడ దూరాన మున్సిపాల్టీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తయినప్పటికీ పార్వతీపురం మున్సిపాలిటీ అభివృద్ధికి ఆమడదూరాన ఉంది. ఈ ఏడాది కాలంలో మున్సిపల్ పరిధిలో గల 30 వార్డుల్లో ఎక్కడా ఒక్క అభివృద్ధి పని జరిగిన దాఖలాల్లేవు. ఈ పరిస్థితిని ప్రస్తుతమున్న పాలకవర్గం, కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం చూస్తుంటే పట్టణ ప్రజలపైనా, మున్సిపాలిటీపైనా వీరికి ఏ మాత్రం శ్రద్ధ ఉందో ఇట్టే అర్థమవుతుంది. యధా రాజా... తథా ప్రజా అన్న చందంగా దీన్ని ఆసరా తీసుకుని మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాల అధికారులు, సిబ్బంది కార్యాలయానికి వచ్చామా, వెళ్ళామా అన్నట్టుగా వ్యవహారం సాగుతోంది. దీంతోపాటు కార్యాలయంలో ఉన్న పలు విభాగాల అధికారుల మధ్య ఒకరికొకరు పొంతన లేకుండా ఉండడమే కాకుండా పాలకవర్గ కౌన్సిల్ సభ్యులన్న, కూటమి ప్రజా ప్రతినిధులన్నా లెక్కలేని విధంగా ఎవరి దారి వారిదే అన్న చందంగా కాలం వెలబుచ్చుతున్నారు. పరిపాలనపై దృష్టి సారించాల్సిన కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు ఎవరి వ్యాపకాల్లో వారు ఉండి పట్టణ అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో కార్యాలయంలో ఉన్న మున్సిపల్ కమిషనర్‌తో పాటు, పలు విభాగాల అధికారులు ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపైన, అభివృద్ధి పనులు పైన కనీసం దృష్టి పెట్టడం లేదు. వాహనాల ఆయిల్ బిల్లులు, స్టేషనరీ ఖర్చులు, అమ్మవారి పండగ సందర్భంగా రోడ్డు రిపేరు ఖర్చులు, అదనపు వాటర్ ట్యాంక్ అద్దె చెల్లింపులు, అదనపు పారిశుధ్య నిర్వహణ కార్మికుల వేతనం చెల్లింపులు, ఇతరత్రా ఖర్చులు అంచనాలకు మించి ఖర్చులు చేస్తూ బిల్లులు చెల్లిం పులు జరు గుతు న్నట్లు బహి రంగ విమర్శ లు వినిపిస్తు న్నాయి.

ఐదు నెలల తర్వాత ఇటీ వల పాలకవర్గ సమా వేశం జరిగి పలు అభివృద్ధి పనులతో పాటు పట్టణంలోని కాలువల్లో పూడిక తీత పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపినప్పటికీ ఆ పనులు చేసేందుకు ఏ ఒక్క కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడం విశేషం. మరికొన్ని రోజుల్లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న పెద్ద కాలువలతో పాటు అన్ని వార్డుల్లోనూ చిన్న చిన్న కాలువల్లో పూడికలు పేరుకుపోయాయి. దీంతో వాడుక నీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో పూడిక తీత పనులు మొదలు పెట్టలేదు. వర్షాలు ఎక్కువగా కురిస్తే వరహాల గెడ్డ పరివాహక ప్రాంతంతో పాటు, శివారు కాలనీల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రత్యేక దృష్టి సారించి, వార్డుల్లో జరగాల్సిన అభివృద్ధి పనులపైనా, పట్టణ ప్రజల ప్రధాన సమస్యలైన తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రోడ్లు, కాలువలు, తదితరు సమస్యలపైనా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దశాబ్ద కాలంగా నిర్మాణానికి నోచుకోని కంచర వీధి కాలువ.

నాలుగైదు రోజులకు ఒకసారి కుళాయి నీటి కోసం ఎదురుచూపులు

పట్టణంలోని జగన్నాథుని రథయాత్రలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

ఘనంగా జగన్నాథ రథయాత్ర

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

జగన్నాథ స్వామి రథయాత్ర దేవాదాయ శాఖ ఇఒ ఎం.ప్రసాద్ పర్యవేక్షణలో శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద గల జగన్నాథ స్వామి ఆలయంలోని జగన్నాథం స్వామి, బలభద్ర స్వామి, సుభద్ర దేవి విగ్రహాలకు ఆలయ అర్చకులు రవీంద్ర పండా, శశిభూషణ్ పండా ప్రత్యేక అలంకరణ చేసి, పూజల నిర్వహించి, ఒరియా బ్రాహ్మణుల ఆధ్వర్యంలో భాజా భజంత్రీలతో ఆలయం నుంచి జగన్నాథుని రథం మీదకు విగ్రహాలను అంగరంగ వైభవంగా తీసుకొచ్చి ఉంచారు. పట్టణ ప్రజలు ఆ దేవతా మూర్తుల విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రజల సహకారంతో జగన్నాథుని రథాన్ని పాలకొండ రోడ్డు పక్కనే ఉన్న గుడించా మండపానికి తీసుకువెళ్ళారు. తొమ్మిది రోజులు తొమ్మిది అలంకారాలతో జగన్నాథుడు భక్తులకు దర్శనమిస్తారు. జిల్లా ఇన్చార్జ్ అచ్చం నాయుడు, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ జగన్నాధుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీరఘట్టం : మండల కేంద్రంలోని తొలి రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. తొలుత జగన్నాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను రథం మీదకెక్కించి, ప్రధాన రహదారి గుండా ఊరేగింపుగా వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో గుండుశా మందిరం వద్ద నిలిపివేశారు. జగన్నాథం దర్శించుకునేందుకు భక్తుల రథం వద్దకు చేరుకున్నారు. ఆలయ అర్చకులు లింగరాజు రథో భక్తులు పాల్గొన్నారు.

చదువుకున్న కాలేజీకి ప్రిన్సిపల్ కావడం అదృష్టం

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.రామారావు

ప్రజాశక్తి - పార్వతీపురం

తాను ఇంటర్మీడియట్ చదువుకున్న కాలేజీకి ప్రిన్సిపల్‌గా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జెంజేటి రామారావు చెప్పారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

మాది గరుగుబిల్లి మండలం మార్కొండపుట్టి. మాది వ్యవసాయ కుటుంబం. తండ్రి జెంజేటి స్వామినాయుడు గ్రామకరణంగా పని చేశారు. తల్లి అన్నపూర్ణ. ఇద్దరూ మరణించారు. 1963 జూలై 1న పుట్టిన నేను ఒకటి నుంచి ఏడో తరగతి వరకు మార్కొండపుట్టి యుపి పాఠశాలలో విద్యాభాసం సాగింది. 8నుంచి 9 తరగతి సగం వరకు పార్వతీపురం మండలం తాళ్ళబురిడి జెడ్పీ హైస్కూల్లో చదువుకున్నాను. తొమ్మిదో తరగతి నాగూరు జెడ్పీ హైస్కూల్‌లో పూర్తి చేశాను. పదోతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేశాను. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కెజిఆర్ కాలేజీలో బిఎస్సీ పూర్తి చేశాను. రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎమ్మెస్సీ చదివాను. 1996లో చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్‌గా నా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. ఆ తర్వాత కురుపాం, సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్‌గా పని చేశాను. 2013 నుంచి 2017 వరకు ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేశాను. ఆ తర్వాత చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ఆరేళ్ల పని చేశాను. 2022 జూలైలో పార్వతీపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చేరి ఇక్కడే ఉద్యోగ విరమణ చేయడం చాలా సంతృప్తి నిచ్చింది. కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చర్యలు తీసుకుంటూ వస్తున్నాను.

భార్య భారతి ఉద్యోగ నిర్వహణలో సహకరిస్తూ వచ్చింది. నాకు ఇద్దరు అన్నయ్యలు వున్నారు. జెంజేటి గోపాలరావు మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎంగా ఉద్యోగ విరమణ చేశారు. మరో అన్నయ్య తిరుపతిరావు గిరిజన సంక్షేమశాఖలో హెచ్‌ఎంగా పని చేసి ఉద్యోగ విరమణ చేశారు. ఇద్దరు అక్కలు సత్యవతి, లక్ష్మీ ఉన్నారు. బావ మూడడ్ల అప్పారావు పశుసంవర్ధక శాఖ ఎడిగా పని చేసి ఉద్యోగ విరమణ చేయగా, మరో బావ గొంగాడ కృష్ణ కాలేజీ ప్రిన్సిపల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దబ్బాయి వెంకట సాయికష్ణ ఎంఎ చదువుకున్నారు. ఉద్యోగ అన్వేషణలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. చిన్నబ్బాయి రామానంద సాగర్ మెడిసిన్ పిజి చదువుతున్నారు. తమ కుటుంబానికి రాజకీయ నేపథ్యం కూడా ఉంది. మా అన్నయ్య గోపాలరావు భార్య ఇందిరమ్మ మార్కొండపుట్టి సర్పంచ్‌గా ఉన్నారు. అంతకు ముందు గరుగుబిల్లి ఎంపిపిగా కూడా ఎన్నికయ్యారు.

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

ఎల్ ఎఫ్ ఎల్ హెచ్‌ఎం శ్రీరాములు

ప్రజాశక్తి- పార్వతీపురం

తాను చదువు చెప్పిన విద్యార్థుల్లో ఎంతోమంది డాక్టర్లు, ఇంజినీర్లు, ప్రొఫెసర్లుగా ఉన్నత శిఖరాలకు ఎదగడం ఉపాధ్యాయునిగా తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని బాలగుడబ ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు మర్రాపు శ్రీరాములు అన్నారు. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లో....

మా స్వగ్రామం గరుగుబిల్లి మండలం నందివావలస. మర్రాపు లక్ష్మునాయుడు, పారమ్మలు తల్లిదండ్రులు. ప్రాథమిక విద్య స్వగ్రామంలోనూ, ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు తోటపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్‌లోను, పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ పార్వతీపురం ఎస్వి డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఒడిశాలోని బరంపూర్ ఆర్‌సిఎం బిఇడి కళాశాలలో బిఇడి పూర్తి చేశాను. 1989 సెప్టెంబర్ 23న పెదమేరంగి ఎంపిపి స్కూల్లో తొలుత ఎస్‌జిటి ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. ఒక్క ఏడాదిలోనే పార్వతీపురం మండలం బందలుప్పి జిల్లా పరిషత్ హై స్కూల్‌కు బదిలీ అయింది. ఇక్కడ 13 ఏళ్ల పనిచేశాను. ఆ సమయంలో విధి నిర్వహణ అనంతరం విద్యార్థులకు ఉచితగా ట్యూషన్లు చెప్పడం ద్వారా గ్రామస్తులతో కుటుంబ సంబంధాలు ఏర్పడ్డాయి. 2002లో గరుగుబిల్లి మండలం పెద్దూరు బదిలీ అయ్యాను. అక్కడ తొమ్మిదేళ్ల పని చేశాను. 2011లో అదే మండలం సాంబన్నవలస బదిలీ అయింది. 2017లో కొంకిడివరం ఎంపియుపి స్కూలుకి బదిలీ అయింది. 2019లో మళ్లీ బదిలీపై పార్వతీపురం మండలం బాలగుడబ ఎంపిపి పాఠశాలకు ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతిపై బదిలీ అయ్యాను. నేడు ఉద్యోగ విరమణ వరకు ఇక్కడనే విధులు నిర్వహిస్తున్నాను.

ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీషు చెప్పరన్న ఆప నమ్మకంతో ఈ గ్రామం పట్టణానికి దగ్గరగా ఉన్నందున ప్రైవేట్ కాన్వెంట్లకు పిల్లలను పంపడం జరిగేది వీటికి ధీటుగా పిల్లలపై శ్రద్ధ పెట్టి ఇంగ్లీష్ నేర్పడంతో పిల్లల తల్లిదండ్రులు గుర్తించి తిరిగి ప్రభుత్వ బడులకు పంపడంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. నాడు-నేడు నిధులతో పాఠశాలను సుందరీకరణ చేయడంతో గుర్తించిన అప్పటి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నందుకు సంతోషాన్నిచ్చింది. భార్య నిర్మల నా విధి నిర్వహణలో ఎంతో సహాయ సహకారాలు అందించారు. కుమారుడు శ్రావణ్ కుమార్ విజయనగరం మహారాజా ఆసుపత్రిలో టెక్నీషియన్‌గా, కుమార్తె స్వాతి టీచర్‌గా స్థిరపడ్డారు. ప్రభుత్వ రంగంలో విద్య బలోపేతం కావాల్సిన అవసరం ఉంది.

ఖరీఫ్‌కు సాగునీరు అందించాలి

మండల సమావేశంలో ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి - వీరఘట్టం

ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులకు సాగునీరందించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఈనెల 20న తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ షట్టర్‌ను పరిశీలించానని, అడుగు ఎత్తు సాగునీరు వృధాగా పోతుందని, షట్టర్ మరమ్మతు పనులు ఎప్పుడు చేపట్టి రైతులకు సాగునీరు ఎప్పుడు ఇస్తారని ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. షట్టర్ మరమ్మతులు చేపట్టేందుకు టెండర్లు కాకముందే పనులు పూర్తి చేసి రైతులకు సజావుగా సాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వైసిపి హయాంలో సాగునీరు, విత్తనాలు, ఎరువులు ప్రణాళిక బద్ధంగా రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అందేవని, ప్రస్తుత ప్రభుత్వంలో అలాంటి చర్యలు కనబడడం లేదని, ప్రకటనలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. అవసరమైన విత్తనాల పంపిణీలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమవ్వడంతో రైతులు ప్రైవేట్ డీలర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అంతేకాకుండా ఎరువులు కూడా సిద్ధంగా లేకపోవడంతో ఈ ఏడాది రైతులు ప్రైవేటు డీలర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, ఆ విధంగా కాకుండా ప్రణాళికా బద్ధంగా రైతులకు సరిపడే ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులకు ఏ విధమైన సమస్య వచ్చినా వారి పక్షాన ఉండి పోరాడుతానని స్పష్టం చేశారు. రంగుల నాయకులు మాటలకు పరిమితం కాకుండా ప్రజాస్వామ్యం బద్ధంగా పని చేయాలని అధికారులకు ఆదేశించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా మండలంలోని అన్ని కాలువల్లో పనులు చేసి కొద్ది రోజులకే మళ్లీ జెసిబిల ద్వారా పనులు చేపట్టి ప్రజాధనాన్ని వృధా చేస్తున్నారని విమర్శించారు. ఏ పనులు చేసినా స్థానిక సర్పంచులు, ఎంపిటిసిల దృష్టికి తీసుకువెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, విద్య, వైద్యం, వెలుగు, గృహ నిర్మాణ, ఐసిడిఎస్, తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. సమావేశంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులు పర్రి విజయకుమారి, వి.భార్గవ్, తహాశీల్దారు ఎ.సాయి కామేశ్వరరావు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రాంత్

సమావేశంలో మాట్లాడుతున్న తెంటు లక్ష్మునాయుడు

సంస్థాగత ఎన్నికలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కొమరాడ

భవిష్యత్తులో జరగనున్న సంస్థా గత ఎన్నికలకు టిడిపి నాయకులు, కార్యకర్తలు అందరూ సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. శుక్రవారం కొమరాడలో టిడిపి అడ్‌హక్ కన్వీనర్ శేఖర్ పాత్రుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ సంస్థా గత ఎన్నికల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు చేస్తుందో ప్రజలకు స్పష్టంగా వివరించి పార్టీ బలోపేతానికి ప్రజలతో నాయకులు మమేకం కావాలన్నారు. రాష్ట్రం ఆర్థిక వ్యవస్థలో ఉన్నప్పటికీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలు పడిన ఇబ్బందులను ఇప్పుడున్న ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును తెలుసుకొని ప్రజల్లోకి పథకాలను తీసుకువెళ్లాలని సూచించారు. సంస్థా గత ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్దమై పార్టీ బోలోపేతానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్ల రామకృష్ణ, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గండి రామి నాయుడు, బలిజిపేట పేట మండల టిడిపి అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, నాయకులు సుదర్శన్‌రావు, దేవకోటి వెంకట నాయుడు, పలువురు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెనూ అమలు చేయకపోతే చర్యలు

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న మధ్యాహ్న భోజనం పథకం మెనూ సక్రమంగా అమలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఇఒ జామి నారాయణస్వామి అన్నారు. శుక్రవారం కోటిపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు సక్రమంగా మెనూ అమలు చేయకపోవడం, రుచికరమైన భోజనం లేకపోవడంతో వారిని మార్చమని అన్నారు. ప్రస్తుతం ఉన్న నిర్వాహకులు మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు పెట్టకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు పెట్టిన పులిహోరా రుచికరంగా లేకపోవడం అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ ప్రకారం సక్రమంగా రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించకపోతే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికైనా పాఠశాల పనిచేస్తున్న ఉపాధ్యాయులు మధ్యాహ్నం భోజనం పథకం పనితీరుపై పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావుకు ఆదేశించారు. ఇలా నిర్లక్ష్యంగా మధ్యాహ్న భోజనం పెడితే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రజ్జిలిలో డిఎ జుగా

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో ఏగులువాడ పంచాయతీ రజ్జిలి గ్రామంలో శుక్రవారం ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో డిఎ జుగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు కార్యక్రమం ముఖ్యో ద్దేశం వివరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా గిరిజన ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే డిఎ జుగా కార్యక్రమం ఉద్దేశమని, కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి వచ్చి వారికి కావాల్సిన అవసరాలు గూర్చి తెలియజేయాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా పర్యటనకు ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చన్నాయుడు శుక్రవారం కురుపాం నియోజకవర్గ హిజ్రాల అధ్యక్షులు ఎ.గీతారాణి వారి సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2015లో కురుపాంలో 7 సెంట్లు భూమి ఇచ్చారని, ఆ భూమి వద్ద కమ్యూనిటీ హాలు నిర్మించి వసతి కల్పించి హిజ్రాలకు వృత్తి శిక్షణ ఇచ్చి జీవనోపాధి అవకాశం కల్పించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

విలేకరులు కావలెను

ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు ఈ క్రింది కేంద్రాల్లో ఆసక్తి గల విలేకరులు కావలెను

అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యలపై అవగాహన

-: విలేకరులు కావాల్సిన ప్రాంతాలు :-

గరివిడి, జామి, కొత్తవలస రూరల్, జియ్యమ్మవలస, సాలూరు, పార్వతీపురం రూరల్, బలిజిపేట రూరల్

ఇంటర్వ్యూ : తేది: 04-07-2025 శుక్రవారం ఉదయం 10 గంటలకు

సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు :
9490099164, 9490099156, 8331011960

ప్రజాశక్తి కార్యాలయం
అశోక్ బంగ్లా ఎదురుగా, ఆర్ అండ్ బి జంక్షన్, విజయనగరం